# ఉ రి కం బం

ఏ కాం కి క

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

# Urikambam (ఉరికంబం)

(A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

డిజిలిటీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084.
Cell -9440495887.

Web Site : can down load digital copies at
nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# కృతిసమర్పణము

## మిత్రశ్రీ
## డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారికి

*అంకితమగుత చిరస్నే
హాంకము స్వర్ణోత్సవోపహార స్రజమై
సంకలనముగా నా యే
కాంకికలు నవభువనవిజయాధ్యతునకున్.*

*రాజువుగావుగాని, నటరాజువు నాటకరంగమందు, ఉ
త్తేజమునం, దుదారగుణదీధితి, రాజసతీవియందు ఏ
రాజుకు తీసిపోవు; అనురక్తిని ఈ కృతి గొమ్ము, స్వర్ణ నీ
రాజన మంగళాశిష విరాజన జన్మదినోత్సవమ్ములో.*

*నీ మది చంద్రికా తరళ నిత్యవసంతమనోజ్ఞ నంద నా
రామము; దివ్యసౌరభ నిరంతర నాట్యకళాప్రఫుల్లమున్;
కోమలభావవీచికలకున్ గిలిగింతలు  పెట్టు ఈ పూరా
రామము నీదు  పేరున విరాజిలెడిన్ ప్రతిబింబసామ్యమై.*

# నివేదన

## I

**"ఉరికంబం,"** ఏకాంకిక 'దశరూపకములు' సంపుటిలో ఒకటి. ఉరికంబం, గీతకత్తి, తమ్ముడు, పద్యంగాని పాటగాని లేని పోడిమాటల ప్రోగులు. గీతకత్తిలో రెండే పాత్రలు. మిగతా ఏకాంకికలలో జ్యోత్స్నాభి సారిక, గోదావరి సంగమం నృత్యనాటికలు. వీరాభిషేకం, త్యాగరాజు గద్య పద్య సంకలితాలు. మరణాంతకం వట్టి ప్రహసనం. ఈ ఏకాంకికలలో ప్రస్ఫుటంగా కనిపించే వైవిధ్యంలో రచయిత ఆత్మీయత వినా, ఏకత్వం మృగ్యం.

## II

తెలుగుగడ్డ — అవహేళనరూపకం (Satire). ఈ అభూత కల్పన చదివిన దేశభక్తులకు రచయితపై కోపం రావచ్చు. వారిని రచయిత ఉమాభిత అర్థిస్తున్నాడు. కాని, ఒక మనవి. ఆత్మనిష్ఠ మైన అవహేళన ఆరోగ్యలక్షణం. అదిగాక తెలుగుగడ్డలో అవహేళనపూర్వకంగా భాసించే ప్రతి అక్షరం వెనుక రచయిత వేడి కన్నీటిబొట్లు మారువేషంలో దాగియున్నదని మరువవద్దు.

## III

ఏ నాటకమైనా ఈ జగన్నాటకంలో అంతర్నాటకమే — అనే అనుభూతి పొందినవాడు జీవన్ముక్తుడే. జగన్నాటకాన్ని మించిన నాటకం ఏముంది కన్నుతెరచి చూడగల సహృదయునికి? వేరే నాటకాలు చదవటం ఎందుకు? ఆడటం ఎందుకు? వ్రాయటం ఎందుకు?

## IV

ఈ నాటికలు వ్రాసిన చిరకాలానికి ప్రచురించటానికి కారణం రచయిత కాదని మనవి. ఈ నాటికల రచనకు మిత్రశ్రీ డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రేరకుడు. రచనను ప్రోత్సహించి చేసిన తప్పుకు ముద్రణభారం వహించి, ప్రచురించటం నిష్కృతి కాబోలు.

## V

ఈ ఏకాంకికలు చదివి, ఎవరూ విలువగల తమ కాలాన్ని వెచ్చించవద్దని రచయిత హృదయపూర్వకమైన మనవి. ఒకవేళ పొరపాటున చదివినా ప్రదర్శించుటకు పూను కోవద్దని రచయిత సలహా. ప్రదర్శించేవారు తమకాలాన్నే గాక ప్రేక్షకుల అమూల్య కాలమునుగూడ దుర్వినియోగం చేసినవారవుతారని, అందుకు రచయిత ఎంతమాత్రమూ బాధ్యుడు కాదని హెచ్చరించుచున్నాను.

**నండూరి రామకృష్ణమాచార్య**

# ఉరికంబం

## భూమికలు:

### 1. పండిత పట్టాభిరామ సూరి :

పట్టాభిరామాలయ ధర్మకర్త. పండితుడు, సంపన్నుడు. ధన గర్వం, విద్యా గర్వం, వంశ గర్వం ముప్పిరిగొన్న అహంభావం అతని కనుగొల్కులలో చిందులాడుచుండును. సుమారు 50 ఏండ్లవాడయినా, 40 ఏండ్లు దాటనివాడుగానే కనిపిస్తాడు.

### 2. వైదేహి:

పట్టాభిగారి గృహిణి. సుమారు ముప్పదియేండ్లుంటాయి. పుట్టిన ఇల్లు, మెట్టిన ఇల్లు ఒక్కచోటులే. అందం, గరువతనం, ఆభిజాత్యం పెనవేసికొన్న మూర్తి.

### 3. చంద్రశేఖరం:

ముప్పదియేండ్ల యువకుడు. సర్వతంత్రస్వాతంత్ర్య ప్రవృత్తితో విచ్చలవిడిగా విహరించి, బాగుపడలేకపోయిన వ్యర్థుడుగా పేరు కెక్కినవాడు.

**4. రంగస్వామి:** చంద్రశేఖరం అన్న.

**5. సార్జెంటు:** [భటులు]

# ఉరికంబం

**సమయం:** సిపాయిల విప్లవం సాగుచున్న రోజులు. సాయం సంధ్యా సమయం.

**స్థలం:** భువనగిరికోటకు సమీపంలో ఉన్న ఒక చిన్నకోట - రామగిరికోట. పండిత పట్టాభిరామసూరి ఇల్లు.

నేలమీద రంగురంగుల తివాచీలు, గోడలకు చిత్రలేఖనాలు, నల్లచేవ బల్ల, పరివార పట్టాభిరామ విగ్రహాలు. గుడిగంటలు మ్రోగుతూవుంటాయి. సుదూరంలో

శతఘ్న్యా రావాలు వినిపిస్తూ వుంటాయి.

వైదేహి వ్యాసపీఠంముందు కూర్చొని గజేంద్రమోక్షం పారాయణ చేస్తూ వుంటుంది.

***కలడందురు దీనులయెడ***
***కలడందురు పరమయోగిగణముల పాలన్***
***కలడందు రన్ని దిశలను***
***కలడు కలడనెడివాడు కలడో లేడో.***

**పట్టాభిరామసూరి :** [ప్రవేశం - జరీతలపాగ చిలక్కొయ్యకు తగిలిస్తాడు. వైదేహి చేతికర్ర అందిపుచ్చుకొని మేకుకు తగిలిస్తుంది. పట్టాభి పొడుగుకోటు వైదేహిసాయంతో విప్పి, గోడకు తగిలిస్తాడు. జరీమడతబిళ్ళకండువా నల్ల చేవ బల్లమీద ఉంచుతాడు.]

**వైదేహి:** చిటపాట చినుకులు పడుతున్నట్లున్నవి - తడిసినారా!

**పట్టాభి:** తలపాగ, పైకోటు ఉన్నాయిగద! తడవలేదు.

**వైదేహి:** ఇంతసేపెక్కడ ఉన్నట్లు! ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్నాను.

**పట్టాభి:** ఏం! అందుకేనా గజేంద్రమోక్షం పారాయణ చేస్తున్నావు?

**వైదేహి:** రోజులు బాగాలేవుకద - దేశం అంతా అట్టుడికి పోతున్నది. సిపాయాల తిరుగుబాటు కారుచిచ్చులా దేశమంతా కమ్ముకుంటోంది.

**పట్టాభి:** అవును; భువనగిరికోట సిపాయాల వశమైంది.

**వైదేహి:** భువనగిరికోట మన రామగిరికోటుకు ఎన్ని మైళ్లండీ!

**పట్టాభి:** ముప్పై మైళ్లు, ఇంకేమంది, సిపాయాలు రేపో మాపో మన ఉరు కోటపైకి దండెత్తివస్తారు. మన రామగిరి కోడగోడలపైకి ఫిరంగులు ఎత్తించి సిద్ధంగా ఉన్నారు ఇక్కడి తెల్లదొరలు.

**వైదేహి:** అమ్మయ్యబాబో! ఇటువంటి ప్రమాదపరిస్థితిలో మీరు ఇల్లు వదిలిపెట్టి ఉళ్లో ఉరేగటానికి వెళ్లారా!

**పట్టాభి:** (భాగవతం తీసి - కుర్చీలో కూలబడి కూర్చొని)

***రాక్షస్ మానవు హానివృద్ధులు మహారణ్యంబులో దాగినన్***

***పోకన్ మానదు ప్రాణమేవిధమునన్ పోషించి రక్షించినన్.***

**వైదేహి :** చాలుచాలు ఈ వేదాంతం!

**పట్టాభి :** వేదాంతం జీవితంలో ఎప్పుడూ ఉపయోగపడకూడదనా నీ ఉద్దేశం!

**వైదేహి :** ఇప్పు డదంతా యెందుకండీ ! నన్ను ఒక్క దాన్ని వదిలిపెట్టి మీరు ఊరంతా తిరగటానికి పోతే ఎట్లాగా? ఊరంతా పుకారులే...భువనగిరిలో సిపాయిలు తెల్ల దొరలను చెట్లుకుకట్టి ఉరి తీస్తున్నారుటగా!

**పట్టాభి :** నిజం చెప్పా లంటే – తెల్లదొరలే సిపాయీలను మాత్రమేగాక, సిపాయీలకు సాయంచేస్తున్న దేశభక్తు లనుగూడా చెట్ల కొమ్మలనుండి నడివీధుల్లో ఉరితీస్తున్నారు. ఈ తెల్లవాళ్లు ఆరు వేల మైళ్ళ నుండి మన దేశానికి వచ్చింది దేశభక్తుల్ని ఉరి దీయటానికేనా?

**వైదేహి :** అమ్మబాబో! రెండురోజులనుండి మీరు దేవాలయంలోకికూడా వెళ్లటం లేదు. కొంపదీసి మీరుకూడా ఈ సిపాయిలతో కలిసిపోయా రేమోనని నాకు భయం వేసింది.

**పట్టాభి :** ఈ సమయంలో ఏమాత్రం హృదయం ఉన్నవా డయినా ఏదోవిధంగా సిపాయిలకు సాయంచేయాలి. వీరయ్య భువనగిరికి రమ్మన్నాడు; నీ మూలాన్నే ఆగి పోయాను.

**వైదేహి :** నాకోసమైనా ఆగకపోతారా అనేధైర్యం లేక పోలేదు. మీ అభిప్రాయాలు తెలుసును కాబట్టి ఒక వేళ ఏ ఆవేశంలోనో వెళ్లిపోతారేమోనని భయంకూడ ఒక మూల వేధిస్తున్నది. ఈ సిపాయాలు ఎంతకాలం తెల్ల దొరల ఫిరంగులను ఎదిరించి నిలువగలరండీ!

**పట్టాభి:** ఇంకా యేం తెల్లదొరలు? ప్లాసీయుద్ధం జరిగి సరిగా నూరేళ్లయింది. శ్వేతముఖులు భారతదేశాన్ని నూరేళ్లు పరిపాలిస్తారని భవిష్యత్ పురాణంలో ఉంది.

**వైదేహి:** ఆఁ! అయితే ఇప్పుడు జరిగేదంతా మన భవిష్యత్ పురాణంలో ఇదివరకే వ్రాసి ఉందన్నమాట.

**పట్టాభి:** తెల్లదొరతనానికి కాలదోషం పట్టింది. ఇప్పుడు కాశ్మీరంనుండి కన్యాకుమారివరకూ కనిపించిన తెల్లదొరల్ని వేటాడి చంపి కాకులకు గ్రద్ధలకు బలివేస్తున్నారు సిపాయాలు.

*ఇదుగో! మహాకాళి విజృంభించింది - హర హర మహాదేవ్! శంభో శంకర హర హర మహాదేవ్!*

## *సుదూరంలో ఫిరంగి మ్రోతలు*

**వైదేహి:** అమ్మో! మీరుగూడ సిపాయాలలో కలిసి పోయేటట్టున్నారు. నామీద ఒట్టు పెట్టుకోండి - నన్ను విడిచిపెట్టి వెళ్లనని.

**పట్టాభి:** పిచ్చిదానా! ఇదుగో నీ చేతిలో చేయివేసి ఒట్టు పెట్టుకుంటున్నా; నిన్ను విడిచి నేను ఎక్కడికి వెళ్లగలను! ఎక్కడికీ వెళ్లను. అదిగాక, వాక్శూరులు క్రియాశూన్యులు.

**వైదేహి:** భువనగిరికోటలో పేల్చే ఫిరంగులు ఇక్కడకు కూడా వినిపిస్తాయండీ !

**పట్టాభి:** అంతగట్టిగా మాట్లాడకు. ఈ ఫిరంగి మ్రోతలు మనకోట బురుజులమీదనే కావచ్చు. మనకోట తెల్ల దొరలకిందే ఉందిగద! మరఫిరంగులు కోట బురుజుల మీదకు ఎక్కించి పేల్చటం పరీక్షిస్తున్నారనుకుంటాను.

**వైదేహి:** ఆ మ్రోతలు వింటూంటే గుండె లదిరిపోతున్నాయి.

**పట్టాభి:** ముట్టడించే సిపాయాలను భయపెట్టటానికి ఈ ఫిరంగి మ్రోతలు పనికిరాకపోయినా, కోటలోపలి అమాయిక ప్రజలను ఆదుపులో పెట్టవచ్చుననీ తెల్లదొరల వ్యూహతంత్రం.

**వైదేహి:** అందరూ తలుపులు మూసుకొని ఇంట్లో కూర్చుంటున్నారు. నిన్నటినుండీ పనిమనుషులుగూడా రావటం లేదు. మీరుమాత్రం ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతున్నారు.

**పట్టాభి:** "పరోపకార్థ మిదం శరీరం" అన్నారు. ఇరుగు పొరుగువాళ్లకు ఇక్కట్టు వచ్చినప్పుడు చూచి ఉరుకోవడం నరజన్మ ఎత్తినవాళ్లకు తగదు. పాపం! రంగస్వామి పినతండ్రి భువనగిరికోటలో ఆహుతియైన మొదటి దేశభక్తుడు.

**వైదేహి:** అంటే? మన వీరయ్యగారి తమ్ముడు - చంద్రయ్యగారేనా? అయ్యో! ఆయనగారి కేమైందండీ?

**పట్టాభి:** భువనగిరికోటపై తెల్లదొరల జెండా పీకేసి, సిపాయాల విప్లవధ్వజం ప్రతిష్ఠించిన మొదటి యోధుడు అతడే. అతన్ని పట్టుకొని తెల్లదొరలు ఉరిదీశారు.

**వైదేహి:** అయ్యో! అటువంటిపని అతడెందుకు చేశాడండీ!
**పట్టాభి:** ఎందుకా! ఆ దేశభక్తుని మృతవార్త సిపాయాలలో మరింత ఉత్సాహాన్ని పురికొల్పి, విప్లవాగ్నిని రేకెత్తించింది. తత్ఫలితం భువనగిరికోట సిపాయాల వశమైంది. ఉపదేశంకంటె ఉదాహరణమే మేలు.

**వైదేహి:** అయితే, వీరయ్యగారుకూడా అట్లాగే మరణించినారా?

**పట్టాభి:** కాదు. తమ్ముని మరణవార్త విని, అక్కడకు వెళుతూ ప్రమాదవశాత్తు గుండుదెబ్బ తగిలి చచ్చిపోయాడు.

**వైదేహి:** అవును; యుద్ధభూమిలోకి వెళితే ప్రమాదం అని తెలియదా? తెలిసి తెలిసి మృత్యుముఖంలోకి దూరినట్లయింది.

**పట్టాభి:** అడంగి లేకమాటలు మాట్లాడుతున్నావు. యుద్ధం చేసేవాళ్లుమాత్రం అందరూ చస్తున్నారా? ఇంట్లోకూర్చునేవాళ్లు అందరూ బ్రదుకుతున్నారా! వీరులు ఒకసారే చస్తారు. పిరికిపందలు ప్రతిరోజూ చస్తూనే ఉంటారు.

**వైదేహి:** అదిగాదండీ! వీరయ్యగారు చావును చేతులారా కోరి తెచ్చుకున్నట్లయిందని అంటున్నాను.

**పట్టాభి:** జాతస్య మరణం ధ్రువం - తమ్ముడు చచ్చిపోయాడని తెలిసినతర్వాత అన్నగారు వెళ్లవద్దా మరి!

**వైదేహి:** అయితే, మీ రిప్పుడు వాళ్లయింటికి ఓదార్పుకు బయలుదేరే రన్నమాట! వాళ్లింటి నుండేనా రావటం!

**పట్టాభి:** అవును. ఒక చిక్కుకూడా వచ్చిపడింది. నేను వెళ్లక తప్పలేదు. ధర్మకర్తనుగదా! ఉళ్లో ఏసమస్య వచ్చినా...
**వైదేహి:** ధర్మకర్తగారు మహాపండితుడు, ధర్మమూర్తి అనే పేరుకోసం మీరు ప్రాకులాడుతున్నారు. మీకేదైనా ప్రమాదం వస్తే, మిమ్మల్ని రక్షించేవా రెవరు!

**పట్టాభి:** 'కీర్తిప్రలోభం మహానుభావులలో ఉండే ఏకైక దుర్గుణం' అంతేకాదు; వీరయ్య మరణశాసనం వ్రాసి, పెద్దచిక్కు తెచ్చిపెట్టాడు. ఉళ్లోకల్లా పెద్దమనిషిని, నిరాశ్రయులైన వాళ్ళు నన్ను ఆశ్రయించారు. నేను భయపడి ఇంట్లో కూర్చుంటే బాగుంటుందా?

**వైదేహి:** ఇప్పుడు వీలులేదు - 5, 6 రోజులు పోయాక చూచుకోవచ్చునని చెప్పి తప్పించుకోలేకపోయారా?

**పట్టాభి:** అట్లాగే చెప్పి తప్పించుకు వచ్చాను. వాళ్లని మన యింటికే రమ్మని కబురు పెట్టాను, ఎవరైనా వచ్చారా?

**వైదేహి:** ఎవరూ?

**పట్టాభి:** వీరయ్యగారి పెద్దబ్బాయి - రంగసామిని రమ్మన్నాను.

**వైదేహి:** రెండోవాడినేమో అని!

**పట్టాభి:** రెండోవాడు ఒక పట్టాన దొరుకుతాడా? వాడిని గూడా వెతికి పట్టుకొని పంపించమని చెప్పానుగాని...

**వైదేహి:** ఛీ! వాన్నెందుకు రమ్మన్నారు ? అటువంటివాడితో మాట్లాడితే మీకే పరువుతక్కువ.

**పట్టాభి:** చంద్రశేఖరం అంటే ఉరంతా అసహ్యించుకున్నా, నాకుమాత్రం వాత్సల్యం లేకపోలేదు.
**వైదేహి:** వాత్సల్యం! ఉట్టిశుంఠ! చిన్నప్పటినుండీ అతన్నినే నెరుగుదును. వీధిబడిలో చదువుకునే రోజుల్నుంచి - అక్షరాభ్యాసం అయిన అయిదురోజులు దాటకుండా అయ్యవారి పిలకకు తాడుకట్టి అరుగుకిందకు పడేటట్లు లాగివేశాడు.

**పట్టాభి:** ఆ నిద్రబోతు అయ్యవారికి ఆ పరాభవం జరగటం చేత ఆయన ఉరు వదిలిపెట్టి పోయాడు, పిల్లలంతా బాగుపడ్డారు.

**వైదేహి:** చంద్రశేఖరం తప్ప - అని చేర్చండి.

**పట్టాభి:** పెద్దయినతర్వాత ఘనకార్యాలు సాధించిన మహా పురుషులంతా చిన్నప్పుడు గొప్పఅల్లరి చేసినవాళ్లే.

**వైదేహి:** అయితే - చిన్నప్పుడు అల్లరిచేసినవాళ్లందరూ పెద్దయినతర్వాత గొప్పవారు కావచ్చుగద!

**పట్టాభి:** చిన్నప్పుడు అల్లరి చేయలేనివాడు పెద్దవాడయి చేయగలిగిందిగూడా శూన్యం.

**వైదేహి:** ఉరంతా వట్టి వెధవ క్రింద చూస్తున్నా, సిగ్గు లేకుండా తనంత మొనగాడు లేనట్లు రొమ్ము విరుచుకొని తిరుగుతాడు. చంద్రశేఖరం అంటే చిన్నప్పటినుంచి నాకు అసహ్యం. సూటిగా చెప్పండి - మీకుమాత్రం అసహ్యం లేదా?

**పట్టాభి:** అసహ్యం అనురాగం ఒకేరూపాయినాకానికి బొమ్మ బొరుసు వంటివి. అసహ్యం - నిజానికి అజ్ఞాతగౌరవమే.

**వైదేహి:** ప్రతివాదిభయంకర బిరుదాంకితులు మీరు - ఆడ దాన్ని నేను మిమ్మల్ని గెలువగలనా వాదంలో. నే చెప్పింది జనవాక్యం.
**పట్టాభి:** చంద్రశేఖరం కరకు మనిషి.

***నిండు మనంబు నవ్యనీతసమానము***
***పల్కు దారుణా ఖండల శస్త్ర తుల్యము***

అన్నాడు నన్నయ మహాకవి. చంద్రశేఖరంలో పైకి కనిపించే కరుకదనం, అంతరాత్మలోని మెత్తదనం అని నా అనుమానం. ఇప్పుడు అతని తండ్రి మరణశాసనం అదే ఋజువుచేసింది.

**వైదేహి:** ఆ! అడగటం మరచిపోయాను - వీరయ్యగారు మరణశాసనంలో ఆస్తి ఎవరికి వ్రాశారండీ!

*రంగస్వామి ప్రవేశం*

**రంగస్వామి:** ఎవరికి వ్రాశాడా! ఎప్పుడైనా నా అనుకున్నమా? అంతా ఆశ్చర్యం. మా నాన్నగారికి చచ్చిపోయేముందు మతిపోయియుండాలి. ఆస్తి అంతా పెళ్లీ పెటాకులు కాని మా తమ్ముడు చంద్రశేఖరం పేర వ్రాసి, మా అమ్మకు మనోవర్తి, నా కింత తిరిపం మిగిల్చాడు. మా తమ్ముడు ఒక్క రోజైన ఇంటిపట్టున ఉన్నాడా! ఉళ్లో ఎవర్నయినా అడగండి. వాడు ఉట్టి అల్లరిచిల్లరగా తిరిగే పోకిరివాడని అందరికీ తెలుసునుగదా - మా నాన్నగారు ఆస్తి అంతా వాడి కేట్లా వ్రాశారండీ? అది చెల్లుతుందా?

**పట్టాభి:** ఆగవోయ్; మీ నాన్నగారు వీలునామా స్వదస్తూరితో వ్రాశారు. చెల్లకేం! పైగా అంతా వారి స్వార్జితం.

**రంగ:** మా అమ్మగారి ఇష్టంలేకుండా చెల్లుతుందా! మా నాన్నగారు ఆస్తిఅంతా చంద్రశేఖరం పేర వ్రాస్తే ఎట్లా చెల్లుతుంది! అన్నగార్ని నేనున్నాను, నా పిల్లలున్నారు. మా అమ్మగారు బ్రతికివున్నారు. చూడండి - మా ఆస్తి అంతా మా తమ్ముడికి దక్కితే, ఒక్క సెంటైనా మిగులుస్తాడా?

**వైదేహి:** మీ నాన్నగారు చాలా అన్యాయం చేశారు. తెలిసి తెలిసీ - ఆస్తి అంతా చంద్రశేఖరానికి ఎట్లా వ్రాశారయ్యా మీ నాన్నగారు?

**పట్టాభి:** ఆఁగు; ఏదైనా తండ్రికి బాగుపడే పిల్లలమీదకంటే చెడిపోయే పిల్లలమీదే ఎక్కువ ప్రేమ ఉంటుంది.

**రంగ:** బాగుందండీ మీ తీర్పు! అందుకని ఆస్తి అంతా చెడిపోయేవాడి చేతికే ఇస్తే - వాడు తనతోపాటు ఇతరుల్నిగూడ చెడగొడతాడు. అప్పడే వాడు లంకవరంలో ఆస్తి మా పినతండ్రి పిల్లలను అనుభవించమన్నాడట. చెప్పండి - నేనూ నా పిల్లలూ ఎట్లా బ్రతికేది? నా పిల్లలను ఎవరు పోషిస్తారు!

*ప్రవేశం: చంద్రశేఖరం - లోపలికి నిష్క్రమణం: వైదేహి*

**చంద్రశేఖరం:** ఎవరు పోషిస్తారా నీపిల్లల్ని! నీ పిల్లల్ని నీవే పోషించుకోవాలి. పిల్లలను కనటంకోసమే భాగవతంలోని భగవంతుడు మనుష్యుల్ని సృష్టించాడని భారతదేశంలోని ప్రజల సమ్మకం! పోషించటం కన్నవాళ్ల ధర్మంకాదా? ఏం, అంత అసమర్థుడివి పెళ్లెందుకు చేసుకున్నావ్?

**రంగ:** నీ మాదిరిగా పెళ్లి పెటాకులు లేకుండా అచ్చోసిన ఆంబోతులాగా ఉళ్ల వెంబడి తిరగడం లేదు. పినతండ్రిగారి పిల్లలమీద ఉన్నంత దయ, సొంత అన్నగారి పిల్లలమీద ఉండకూడదేం? లంకవరంలో ఆస్తి పినతండ్రిగారి పిల్లలకు వదిలేశావటగా?

**చంద్ర:** అదేమి యేడుపురా! ఆ ఆస్తి నాన్నగారున్నప్పటి నుండీ వాళ్లే అనుభవిస్తున్నారు.

**రంగ:** అయితే - నాన్నగారు చచ్చిపోయిన తర్వాత మనం లాక్కోవద్దూ !

**చంద్ర:** చనిపోయిన నాన్నగారి ఉద్దేశానికి అది విరుద్ధం.

**రంగ:** ఇది బ్రతికేవున్న అమ్మగారి అభిప్రాయానికి విరుద్ధం. నాకూ నా పిల్లలకు ద్రోహం.

**చంద్ర:** నీ పిల్లలకు తండ్రివి నీవున్నావు; వాళ్లకు పాపం తండ్రి లేడు, రెక్కలురాని పక్షులు.

**రంగ:** అయితే తలిదండ్రులు లేనివాళ్లందరినీ ఉద్ధరించటానికి మొనగాడవు బయలుదేరావు. అసలు నాన్నగారికి బుద్ధి లేదు, నిన్నని లాభంలేదు. ఊరంతా గొడ్డుపోయిందా! పెద్దలు లేరా! న్యాయానికి చోటులేదా! చూస్తాను...

**పట్టాభి:** ఆగవోయి రంగస్వామి! ఒకటే విసురు, ఆగు. మీ తమ్ముడు మీకు అన్యాయంచేస్తేగదా పెద్దలమాట; ఆగు రంగస్వామీ.

**రంగ:** ఊళ్లో పెద్దలందరినీ పిలుచుకురమ్మని చెప్పిందండీ మా అమ్మగారు; నే వెళ్లాలి...

*నిష్క్రమణం: రంగస్వామి*

**పట్టాభి:** రంగస్వామి నిష్క్రమణం వడగళ్ళవాన వెలిసినట్లేనా? చంద్రశేఖరం! ఇట్లా కూర్చో; నీతో తీరికగా మాట్లాడ వలసిన విషయాలు చాల ఉన్నాయి.

*ప్రవేశం: వైదేహి - దీపారాధన చేస్తూ*

**చంద్ర:** ఓహో! ధర్మకర్తగారు ఇదివరకెన్నడూ చూపించని మర్యాద చూపిస్తున్నారు! అవును; ఇప్పుడు నేనుగూడ ఆస్తిపరుణ్ణి. ఇదివరకు ధర్మకర్తగారిచే మర్యాదపొందే అర్హత లేకపోయినా...

**వైదేహి:** ఆ అర్హత నీకు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ లేదు మొహమాటం విడిచి చెప్పాలంటే.

**పట్టాభి:** చంద్రశేఖరం! ఏమీ అనుకోవద్దు, మా శ్రీమతికి ఎందుకో నీమీద "నిర్హేతుకజాయమానకోపం" అందరి మాటలు విని.

**చంద్ర:** ఈ మాటలు పట్టించుకునేవాణ్ణి కాదని మీకు తెలియదా? అదికాక ప్రపంచంలో అందరూ వైదేహివలె నన్ను నిష్కారణంగా ద్వేషిస్తూ వుంటే నాఅంత ధన్యుడు వేరొకడు ఉండడు.

**పట్టాభి:** విన్నావా వైదేహి! ఇందాకా నే చెప్పలేదూ !

**వైదేహి:** ఉండండి; ఆతనికి సిగ్గు లేకపోతే మీకైనా...

**చంద్ర:** ధర్మకర్తగారూ! నా అంతట నేను మీ యింటికి రాలేదు; రమ్మని మీరు కబురు పంపారని వచ్చాను.

**పట్టాభి:** అదేమిటోయ్ నీతో మాట్లాడాలి. చాలా ముఖ్య విషయా లున్నాయి.

**వైదేహి:** అతనికి అంత తొందరగా ఉంటే వెళ్లమనండి.

**పట్టాభి:** వైదేహి! ఇది నా యిల్లేనా? నీ ఉద్దేశమేమిటి? అతనితో నాకు పనిఉంది. ఎందుకీ ఆగడం!

**చంద్ర:** ధర్మకర్తగారూ! బయటకుపోదాం రండి లేదా పోయి దేవాలయమండపంలో కూర్చొని మాట్లాడుకుందాం.

**వైదేహి:** రోజులు బాగాలేవు. ఇక్కడే ఆ మాటలేవో చప్పన కానిచ్చుకోండి.

**చంద్ర:** వైదేహి! నేనుండటం నీ కిష్టంలేదుకదా? అట్లాం ట ప్పుడు ఎందుకుండాలి?

**వైదేహి:** నీ మాటకాదు ధర్మకర్తగారికోసం అన్నాను, ఈ ఆపత్సమయంలో బయటకు వెడితే ప్రమాదంగదా అని అన్నాను.

**చంద్ర:** ప్రమాదానికి భయపడి మనం దాగుకొంటే, ప్రమా దమే మనల్ని వెదుక్కుంటూ రావచ్చు. పరవాలేదు రండి! లెండి పోదాం. ఇక్కడ చాలా ఉక్కపోస్తుంది. అదిగాక మీరు

పెద్ద ఉపన్యాసం ఇస్తారని నా భయం. అంత పెద్ద ఉపన్యాసం ఈ ఉక్కపోతలో  కూర్చొని భరించలేనని మనవి.

**పట్టాభి:** ఈ మాత్రం ఉక్కపోత భరించలేవు? ఇప్పుడు కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ ఎంతమంది దేశభక్తులు కత్తుల బోనులమధ్య తుపాకీ వర్షాలు భరిస్తున్నారో తెలుసునా?

**చంద్ర:** ఏమిటో, సిపాయిలకు వెఱ్ఱెత్తింది; ఎందుకు చెప్పండి! తుపాకీ తూటాలకు ఆవు క్రొవ్వు పూస్తే యేం! పంది క్రొవ్వు పూస్తే యేం! మీక్రొవ్వు తూటా కొరికితే మజిలీలేకుండా స్వర్గలోకంలోకి, ఆవుక్రొవ్వు తూటా కొరికితే అమాంతంగా నరకలోకంలోకి పోతారా ఏమిటి?

**పట్టాభి:** చంద్రశేఖరం! నువ్వు చాలా పొరబడుతున్నావు. ఒక్కసారి గౌరీశంకర నీడ కన్యాకుమారిమీద పడింది. ఈ మహాప్రళయాగ్ని కీల  ఆవుక్రొవ్వు తూటాలమూలాన పుట్టిందను కోటం కంటె అవివేకం లేదు. రవి అస్తమించని సామ్రాజ్యం ఏలే తెల్లదొరల తెగనీలుగుడు క్రొవ్వువల్ల పుట్టింది. తెల్లత్రాచులకిది సర్ప యోగం.

**చంద్ర:** ధర్మకర్తగారూ, మీరు మళ్లా వెనుకటి సనాతన ధర్మాన్ని స్థాపించాలని ఏదో వెర్రి ఆశ ఉన్నట్లుంది. ఇందులో ఎవరు గెలిచినా కాలచక్రం వెనుకకు తిరగదు. ఈ సిపాయిల తిరుగుబాటు ఎంతకాలం నిలుస్తుందండీ?

**పట్టాభి:** ఇది సిపాయిల తిరుగుబాటు కాదు, భారతీయ స్వాతంత్ర్యసమరయజ్ఞం. తాంత్యాతోపే ధర్మసంరక్షణార్థం, దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం సర్మదానదిని దాటి దక్షిణాపథంలో ప్రవేశించాడు.

**చంద్ర:** మీ రనే మాటలు అనాలంటే ఒక్క సిపాయికి కూడా నోరు తిరగదు. ఈ సిపాయిలకు తగిన నాయకత్వం లేదు, బాలనాయకత్వం, బహునాయకత్వం. ఈ సిపాయి లందరినీ

ఇంతవరకూ కలిపి ఉంచిన సూత్రమేమిటి? తెల్లదొరలపై ద్వేషం, తెల్లదొరల ఉరికంబా లంటే భయం. ఈ భయ విద్వేషాలు ఎంతకాలం సిపాయాలను కలిపి ఉంచగలవండీ?

**పట్టాభి:** మళ్లీ సిపాయీ లంటావు? ఢిల్లీపాదుషా ఖాన్ బహదూర్ షా సిపాయి కాడు. ఝాన్సీ లక్ష్మీబాయి సిపాయి కాదు, నానాసాహెబ్, పీష్వా నారాయణరావు, తాంతియా తోపే వీరిలో ఎవరు సిపాయాలు! ఇంతమంది మహారాజులు, మహామంత్రులు, సేనాధిపతులు, భటులు, పండితులు, ప్రజలు ఆబాలగోపాలం ఈ మహాయజ్ఞంలో తమ సర్వస్వాన్ని సమర్పించటానికి ఎందుకు ముందుకు వస్తున్నారు! తమ సింహాసనాలను, కిరీటాలను, భుజకీర్తుల్ని, ధన ధాన్య సంపదలను అన్నింటినీ ఈ యజ్ఞ హోమ కుండంలో సమర్పించటానికి ఎందుకు ఉద్విగ్నులవుతున్నారు!

**చంద్ర:** అయితే, నిన్నటివరకూ ఫిరంగీలకు వంగి సలాములు కొట్టి చావలేక బ్రదికిన మన మహారాజులూ, వారి పాదాలను ఆశ్రయించి బ్రతికిన సిపాయాలు అమాంతంగా దేశభక్తులై స్వతంత్రవీరులుగా మారిపోయారన్నమాట.

**పట్టాభి:** చంద్రశేఖరం! పొరబడుతున్నావు! నీ వెప్పుడైనా అగ్నిపర్వతం చూశావా? తరుగుల్మలతా శ్రితమై నేత్ర పర్వమై కలకలలాడుతూ కనిపిస్తుంది; లోలోపలి ప్రళయాగ్నికీలల వికటాట్టహాస విలయ తాండవం ఎవరికైనా కనిపిస్తుందా? పరమేశ్వరుని మూసిన మూడవకన్ను చూడు! ధ్యానముద్రాముద్రితుడైన ముక్కంటి మూర్తిభవించిన శాంత రసం. కాని ఆ మూడవకన్ను విప్పినప్పుడు? ఈ విశాలవిశ్వం క్షణంలో అణువులుగా, పరమాణువులుగా ధ్వంసీపటలమై పోతుంది. భారతీయుడు ఇంతవరకూ పచ్చగడ్డి క్రమ్మిన అగ్నిపర్వతం! మూడవకన్ను మూసుకున్న ముగ్ధ రుద్ర మూర్తి! తెలిసిందా?

**చంద్ర:** సిపాయాల తిరుగుబాటు నిలువదండీ! ఫిరంగీల మర ఫిరంగులు చరిత్రలో మరచిపోని పాఠాన్ని భారతీయులకు నేర్పుతాయి.

**పట్టాభి:** పిచ్చి ఊహ! స్వరాజ్య విప్లవసందేశం భారత దేశంలో దిగ్విజయయాత్రకు బయలుదేరింది. ఆ మహా ప్రస్థానం అప్రతిహతం, అజేయం. ఆ మహావిప్లవసందేశం వీధీ వీధీ కుహారాన్ని చీల్చుకొని పయనిస్తోంది. మూసిన దుర్గ ద్వారాలు, ఉన్నతపర్వతపంక్తులు, దుర్గమారణ్యాలు, అగమ్య సరిత్సరోవర సందోహాలు ఆ అమృత స్వాతంత్ర్య సందేశాన్ని అడ్డుకోలేవు. స్వాతంత్ర్యదీక్ష ఉరికంబాన్ని గడ్డిపోచకింద చూస్తుంది. దేశభక్తుల పవిత్ర దేహాలనుండి కారిన ప్రతి రక్తబిందువుండి సహస్ర దేశభక్తులు ఉద్భవిస్తారు. మహారాష్ట్రుల బల్లేలు, రాజపుత్రుల ఖడ్గాలు, సిక్కుల కృపాణాలు, ముస్లిముల చంద్రరేఖలు ఒక్కసారే శత్రుహృదయాలలోకి గుచ్చుకుంటాయి. శంభో శంకర! హర హర మహాదేవ్! స్వతంత్రభారతమాతకి జై!

**చంద్ర:** హిమాలయ నిర్ఝరిణివంటి వాగ్ధోరణితో మీ రిచ్చే గంభీరోపన్యాసం వినాలని నా కెంతకుతూహలంగా ఉన్నా ఈ ఉక్కపోతలో ఉక్కిరిబిక్కిరై పోతున్నా. రండి, దేవాలయ మండపంలోకి పోదాం. అక్కడ మీ ఉక్క దంపుడు ఉపన్యాసం ఎంత సేపైనా సరదాగా వింటాను. పాపం! మన సిపాయాలు ఆసేతుహిమాలయం యుద్ధాలలో చస్తుంటే, మనం ఇక్కడ డొక్క లెగుర వేయవద్దూ ! రండి పోదాం.

**పట్టాభి:** ఇక్కడే కూర్చొని మాట్లాడుకుందాం. అంత ఉక్కపోతగా ఉంటే నీ పైకోటు తీసేయ్.

**చంద్ర:** నాకు తీసెయ్యాలనే ఉంది.

**పట్టాభి:** తీసెయ్; 'హిందూదేశంలో తొమ్మిదినెలలు వేసవి కాలం, మూడు నెలలు తీవ్రవేసవికాలం' అన్నాడట మొన్న సేనాధిపతి కోటలో.

**వైదేహి:** చంద్రశేఖరంగారు దేవాలయంలోకూడ కోటు విప్పకుండా కూర్చుంటారు.

**చంద్ర:** నాకు రాతిబొమ్మలకు గౌరవంచూపించటం ఇష్టం లేదు.

**వైదేహి:** అయితే దేవాలయానికి రావటం ఎందుకు?

**చంద్ర:** (కోటువిప్పి మెడకు తగిలించి) చక్రపొంగలి, పులిహోర కోసం. నిజం చెప్పాలంటే దేవుడికి ఉత్తచెయ్యి చూపించి, ప్రసాదం భక్తులు భుజిస్తున్నారు. ఒకవేళ ఆ రాతిదేవుడే నోరు తెరచి ఆ పులిహోర, చక్రపొంగలి తినటం మొదలు పెడితే మరుదినంనుంచి దేవుడికి ఆరగింపు పెట్టే భక్తులుండరు. దేవాలయాలు పాడుపెట్టవలసివస్తుంది.

**వైదేహి:** విన్నారా! అతనికి మీరు ఏం చెప్పినా బూడిదలో పోసిన పన్నీరు; అతని వాలకం కనిపించటం లేదా. దేవుడంటే గారవం లేనివాడికి ధర్మకర్తగారంటే ఇక వేరే చెప్పాలా!

**చంద్ర:** పోరబడుతున్నావు వైదేహి! రాతిదేవుడన్నా, జరీమడతబిళ్ల గోచీ ధర్మకర్తలన్నా నాకు గౌరవం లేదు గాని, పండిత పట్టాభిరామసూరి గారంటే మాత్రం నాకు కొంతగురి లేకపోలేదు. అటువంటి పండితునికి శత్రువు అనిపించుకున్నా అందులో గారవం లేకపోలేదు.

**వైదేహి:** బాగుంది. స్పష్టంగా చెప్పకూడదా చంద్ర శేఖరం - పండితులు, సాధుపురుషులు - అంతా నీకు శత్రువులే అని.

**పట్టాభి:** ఆగు వైదేహి! మన్నిగూర్చి మన అభిప్రాయం కంటే శత్రువుల అభిప్రాయమే సత్యానికి దగ్గరగా ఉంటుంది. చెప్పవోయ్ చంద్రశేఖరం నన్నుగూర్చి నీ అభిప్రాయం.

**వైదేహి:** వారికి అనుమాన నివృత్తి చెయ్యి చంద్రశేఖరం.

**చంద్ర:** పట్టాభిగారితో ఒక గంటసేపు మాట్లాడితే ఒక సంవత్సరంపాటు పాతపుస్తకాలు చదువ నక్కరలేదు.

**పట్టాభి:** భేష్! ఒక సంవత్సరం నా శుశ్రూష చేస్తే, నిన్ను షట్ శాస్త్ర పారంగతుణ్ణి చేస్తాను.

**చంద్ర:** ధర్మకర్తగారూ! మీరు నన్ను ఎందుకు రమ్మన్నారో సూటిగా చెప్పండి. పండితులు వినయంకంటె ఉపోద్ఘాతమే ఎక్కువ చెప్తారు.

**పట్టాభి:** చంద్రశేఖరం! నిన్ను రమ్మన్నది నీ శ్రేయస్సుకోరే. చూడు, మన కోటచుట్టూవున్న కోటలు కొన్ని సిపాయీలు పట్టుకున్నారు. మీ పినతండ్రి పేరు కెక్కిన సిపాయినాయకుడు. అతన్ని ఉరితీశారుకద! మన కోటలో తెల్లదొరలు నిన్ను పట్టుకొని...

**చంద్ర:** పట్టుకొని!

**పట్టాభి:** ఏముంది? నీమీద ప్రత్యేకంగా వారికికోపం లేకపోయినా నీ పినతండ్రిమీది పగ నీమీద తీర్చుకోవాలని చూడవచ్చు.

**చంద్ర:** ఉరిశిక్షగూడ వారసత్వంలా వస్తుందని బ్రిటిషులాలో ఉందా అండీ!

**పట్టాభి:** అదిగాదు, మనకోటచుట్టూ శత్రుసిపాయీలు ఉన్నారు. కోటలోపల ప్రజలు తిరుగుబడకుండా భయ పెట్టేందుకు ఎవరినో ఒకరిని ఉరిదీయవచ్చు. ఇది కూట రాజనీతి.

**చంద్ర:** కావచ్చు. ఈ మాట నేనుగూడ గాలికబురుగా విన్నాను. కాని, నన్ను ఉరిదీస్తే వారి కేం లాభం! ప్రజలను భయపెట్టాలంటే - ఉళ్లోకల్లా పేరు మ్రోగిన మీవంటి పండితుణ్ణి ఉరిదీయాలిగాని.

**పట్టాభి:** నన్నురితీస్తే రాకుండా చూడాలనుకున్న విప్లవం తత్క్షణం వస్తుంది. ఎంత తెల్లదొరలైనా నా అంతవాడి జోలికి అంత కళ్లుమూసుకొని వస్తారా? వస్తారనుకో - నా దేవాలయం, తరతరాలనుండి వచ్చిన ధర్మకర్తత్వం, నన్ను నమ్ముకున్న ప్రజానీకాన్ని వదలి పోతానా? నీవో ఒంటరివాడవు.

**చంద్ర:** నేను వెళ్లిపోటానికేం - ఒక ఉళ్లో ఇన్నిరోజులు ఎప్పుడూ ఉండలేదు. మా తండ్రిగారి దినవార క్రియల కోసం ఉన్నానుగాని - లేకపోతే యీ పాటికి ఏ ఉళ్లో ఉండేవాడినో?

**పట్టాభి:** ఆ! నీవంటివాడికి మంచి గుర్రం ఉండాలి. చూడు- వాయువేగంతో పోయే పంచకల్యాణి - ఈ సీమకు పేరు తెచ్చింది. ఆ గుర్రం నీకిస్తాను. నా పంచకల్యాణికి రోజూ ఎంత విలువైన దానా వేస్తానో తెలుసా! నా గుర్రం నెల రోజులదానా ఖర్చుపెడితే గవర్నర్ జనరల్ కానింగు తండ్రితాతల కుటుంబానికి ఒక ఏడాది గ్రాసం వచ్చేది. ఇది జీవన్మరణ సమస్య - తత్క్షణం గుర్రమెక్కి ఏ భువనగిరికో తప్పించుకొని పో.

**చంద్ర:** మీ గుర్రంవంటిది లభిస్తే - యమదూతలకుగూడ దొరకకుండా ఉడాయిస్తాను. దానికేం - నాకు మీ విషయమే ఎక్కువ భయంగా ఉంది.

**పట్టాభి:** నీ మాట కేవలం తోసెయ్యకూడదు. అంతవరకూ వస్తే నా పట్టాభిరాముణ్ని తలుచుకుంటూ కన్నులు మూసుకుంటాను. మా పట్టాభిరాముడు - మకరికి జక్కిన గజేంద్రుని రక్షించినట్టు ఈ తెల్లదొరలను సంహరించి రక్షిస్తాడనే అకుంఠితవిశ్వాసం నా కుంది.

నా జీవితమే ఒక సుదీర్ఘశరణాగతి. భక్తులను రక్షించే బాధ్యత భగవంతుడు విస్మరింపలేడు.
**చంద్ర:** భగవంతుడికి వేరే యేంపని లేదండీ - ఈ బోలెడంత సృష్టిలో - ప్రమాదంలో ఇరుక్కొనే భక్తుల్ని రక్షించటం తప్ప. తన్ను తా రక్షించుకో దలచుకోనివాణ్ణి భగవంతుడెందుకు రక్షించాలి?

**పట్టాభి:** అందుకనే నిన్ను నీవు రక్షించుకో! నా గుర్రం ఇస్తాను. నీ పోలాలు నేను చూసిపెడతాను.

**చంద్ర:** నాకు పోలాలబెంగ ఎప్పుడూ లేదు. నాకోసం బెంగపెట్టుకోనేవాళ్లెవరూ లేరు. నన్నురితీస్తే భూభారం తగ్గుతుంది – అంతేకాదూ వైదేహీ!

**వైదేహి:** మీ మాటలు వింటూంటే నా శరీరం కంపిస్తోంది. చావు బ్రతుకులమధ్య ఉన్నప్పుడుగూడ మగవాళ్లు ఇంత ధైర్యంగా ఎట్లావుంటారా అని ఆడవాళ్లకు ఆశ్చర్యంగా ఉంటుంది.

**పట్టాభి:** ధైర్యం పురుషలక్షణం. అయినా ఏ ప్రాణీ వృధాగా బలికాకూడదు. ఏం చంద్రశేఖరం, ఏమంటావు.

**చంద్ర:** నిజమే; వస్తాను సెలవు.

**పట్టాభి:** ఆగు టీ పుచ్చుకొని వెళ్లవచ్చు. వైదేహీ ఏది చప్పన టీ తెచ్చిపెట్టు.

**చంద్ర:** మీరు నోటితో ఉండమంటారు, మీ శ్రీమతి నొసటితో పొమ్మంటోంది. పోతాను, సెలవిప్పించండి.

**పట్టాభి:** ఏమిటిది వైదేహీ! నాయింట్లో నాకు ఆవంత పెత్తనం లేదనిపిస్తోంది.

**వైదేహి:** చంద్రశేఖరం, టీ పుచ్చుకొని మరీ వెళ్లు.
**చంద్ర:** ఇది మనస్పూర్తిగా అంటున్న మాటేనా?

**వైదేహి:** వారి సంతోషమే నా సంతోషం. భర్తఅంటే భార్య అన్నట్లే. మనసూర్తిగా నీకు ఒక కప్పు గాదు, రెండుకప్పులు ఇస్తాను.

*ప్రవేశం: రంగస్వామి*

**రంగస్వామి:** ధర్మకర్తగారూ! ధర్మకర్తగారూ! మీరు వెంటనే రావాలి. పెద్ధమనుష్యులందరినీ పిలిచినా ఒక్కరూ రాలేదు. మీరు వెంటనే రావాలి. మా అమ్మగారు మూర్ఛవచ్చి పడిపోయింది.

**పట్టాభి:** మీ తమ్ముడు ఇక్కడ ఉన్నాడని చెప్పలేదా?

**రంగ:** చెప్పకేం, ఆ పాపిష్టి మొగం చూడనంది.

**చంద్ర:** నేను వచ్చి ఆవిడకు కష్టం కలిగించ దలచుకోలేదులే.

**వైదేహి:** మీ నాన్నగారు ఆస్తిఅంతా నీకు వ్రాసి ఆవిడకు తీరని అన్యాయం చేశారు. పోనీ వెళ్లి ఆవిడను ఓదార్చ కూడదా చంద్రశేఖరం! మీ అమ్మగారు మహాపతివ్రత.

**చంద్ర:** మహాపతివ్రత! స్త్రీలను జీవచ్ఛవాలుగా తయారు చేసేందుకు భారతీయసాహిత్యం కల్పించిన సుకుమార ద్రోహం మహాపతివ్రత అనే మంత్రం.

**వైదేహి:** బాగుంది; పతిభక్తి, పతివ్రత అనే మాటలే నీకు కర్ణకఠోరంగా ఉన్నాయన్నమాట.

**చంద్ర:** కాదు; నేనే ఆడదాన్ని అయితే, భర్త మంచివాడయితే భక్తితో పూజిస్తాను, చెడ్డవాడయితే అసహ్యించు కుంటాను. అంతే. మరణశయ్యమీద మా నాన్నకు జ్ఞానోదయం అయింది. అంతవరకూ మా అమ్మ అంటే మా నాన్నగారికి భయమే.

**రంగ:** ధర్మకర్తగారూ! మీరు వెంటనే రావాలి; మా అమ్మగారి ప్రాణం నిలువదు.

**పట్టాభి:** నేను వెళ్లి మందుఇచ్చి వస్తాను. నువ్వుగూడా వస్తావా చంద్రశేఖరం!

**చంద్ర:** నేను రాను. మీ మందువల్ల ఆమెకు ప్రాణం వస్తుందని నాకు నమ్మకంలేదు. మీరు వెళ్లి మా అమ్మ చెవిలో చంద్రశేఖరం ఆస్తి అమ్మ పేరవాసి ఇస్తానన్నాడని చెప్పండి. చచ్చిపోయినా సరే తిరిగి బ్రతుకుంది. మా అమ్మకు వచ్చింది ఆస్తిరోగం. అంతే. వెళ్ళిరండి.

**పట్టాభి:** చంద్రశేఖరం! ఇప్పుడే వస్తాను రెండునిముషాల్లో. ఆస్తి అంతా నీవు మట్టుకు ఏం చేసుకుంటావు; నీవు అన్యాయం చెయ్యవని చెప్తానులే.

**చంద్ర:** మా అమ్మ మీవంటి పెద్దమనిషి ఘరానాహామీ నమ్మవచ్చులెండి, నా మాట నమ్మకపోయినా.

**పట్టాభి:** (వైదేహిని ప్రక్కకు పిలిచి) ఇదుగో! చంద్ర శేఖరం దారికి వచ్చాడు. రాజీ కుదుర్చేస్తాను. అతన్ని అనవసరంగా అవమానపరిచి తరిమెయ్యకు. తెలిసిందా! రెండునిముషాల్లో వస్తాను.

**వైదేహి:** చప్పున రండి.

*రంగస్వామి, పట్టాభి నిష్క్రమణం*

*వైదేహి టీ కలుపుతుంటుంది - చంద్రశేఖరం ఇటూ అటూ తిరుగుతుంటాడు.*

**చంద్ర:** వైదేహీ! నీకు నామీద గల అభిప్రాయం నాకు పూర్తిగా తెలుసు. నేను పోతాను.

**వైదేహి:** అదేమిటి? టీ పుచ్చుకుందుగాని, ఇంతలో ధర్మకర్తగారు వస్తారు.

**చంద్ర:** నే నిక్కడ ఉండటం సుతరాం నీ కిష్టం లేదని తెలిసి గూడా - నీ గడపలో క్షణకాలం ఎట్లా ఉండమంటావు? నేనుగూడ రక్తమాంసాలు గల మనిషినే. మానాభి మానాలు ఉన్నవాడినే, ఉప్పు, కారం, పులుసు తింటున్నవాడినే.

**వైదేహి:** అవును. నీవు నా విషయంకూడా ఆలోచించాలి. నీకు కోపం రాకుండావుంటే ఒక మాట చెప్తాను.

**చంద్ర:** కోపం ఎందుకు! నీ కిష్టం లేకుండా నీ గడపలో ఒక క్షణమైనా నిలిచేటంత సిగ్గుమాలినవాణ్ణి కాదు.

**వైదేహి:** నిజానికి నీవు ఉండాలనే నా కోరిక. అయితే అది నా కిష్టం అనికాదు. వారికోసం.

**చంద్ర:** ఆ అట్లాగా!

**వైదేహి:** అక్షరాలా. ఆ విషయం నీవు పూర్తిగా గ్రహించావు. నీవంటే నాకు పరమ అసహ్యం అని మా వారికి తెలుసు. నీవు వెళ్లిపోతే నిన్ను అవమానించి పంపేసిన గయ్యాళి గంపనని వారికి నామీద కోపం వస్తుంది. వారికి కోపం రప్పించటం నాకు ఇష్టంకాదు.

**చంద్ర:** ఓహో! అయితే నీవుచేసే సన్మానం తిరస్కరించి వెళ్లిపోతున్న మూఢుణ్ణి అన్నమాట.

**వైదేహి:** (కన్నీటితో) వారు వచ్చేవరకూ ఉండు చంద్ర శేఖరం, నీకు పుణ్యముంటుంది.

**చంద్ర:** ఆఁ వైదేహీ! నీ మనస్సు ఎంతో సుకుమార మైంది. ధర్మకర్తగారు నాకు మర్యాదచూపి, లొంగదీసు కుంటున్నారు. నీ కన్నీటితో కరగించావు. ఏదీ టీ ఇయ్యి. (కూర్చుంటాడు)

**వైదేహి:** దయచేసి కూర్చో, నేను అందిస్తాను.

**చంద్ర:** నేనుగూడ సాయం చేస్తాను.

**వైదేహి:** అబ్బే; నువ్వు మగవాడివి. నీ కెందుకు ఆ కష్టం; నాకు నిత్యం అలవాటే.

**చంద్ర:** (కూర్చొని) సరే.

**వైదేహి:** ఇవి వేడిపాలు, చక్కర ఇదుగో. టీ కషాయం కలపనా కలుపుకుంటావా!

**చంద్ర:** నీ ఇష్టం.

**వైదేహి:** కలిపి ఇస్తా! ఇదుగో.

**చంద్ర:** మరి నువ్వుత్రాగవా!

**వైదేహి:** నే నిప్పుడు త్రాగను.

**చంద్ర:** ఏం! నువ్వుత్రాగంది నే నెట్లా త్రాగేది. ప్రక్కనున్నవారు త్రాగకుండా మంచినీళ్లుకూడా త్రాగలేను.
**వైదేహి:** పరవాలేదు, ఇప్పుడు త్రాగు. నీకే పట్టింపులు లేని మనిషివి.

**చంద్ర:** కాదు; నువ్వు త్రాగితేగాని నేను త్రాగేదిలేదు.

**వైదేహి:** నీ కోసం టీ కలిపానుగదా చంద్రశేఖరం! నువ్వు త్రాగు. నే నెట్లాత్రాగేది వారికి ఇవ్వకుండా?

**చంద్ర:** వైదేహీ! ఏమో అనుకోకు (టీ త్రాగి) ఇది ఒక స్వగతం అనుకో. ఇది నా జీవితంలో ఒక మధురక్షణం! ఇంతవరకూ ఇల్లంటే ఒక చెరసాల అనుకునేవాణ్ణి. కాని నిన్ను చూసినతర్వాత దాంపత్యజీవితంలోని నిర్మల మాధుర్యం, పవిత్రశాంతి అర్థమౌతున్నాయి. కాని, ముదురు బెండకాయ ఆ అదృష్టానికి నోచుకోలేదుగద! (నవ్వుతాడు)

**వైదేహి:** నీ వెకిలినవ్వు నా కర్థంకావటం లేదు.

**చంద్ర:** నా కొక అద్భుతమైన ఊహ తట్టింది. ఇప్పుడిక్కడికి ఎరగనివా ళ్లెవరైనా వస్తే - మనల్నిద్దరిని చూచి భార్యాభర్త లనుకుంటారుగదూ?

**వైదేహి:** అంటే - నీ ఉద్దేశం! వారికీ నాకూ ఈడూ జోడూ కుదరలేదనా? పది పన్నెండు సంవత్సరాలు తేడాఉన్నా,

కోరి కోరి మా నాన్నగారు ముచ్చటపడి ఇచ్చారు. మా యింట్లో ఎవరికీ ఆ తేడా తట్టదు.

**చంద్ర:** అబ్బే - నన్ను అపార్ధం చేసుకున్నావు వైదేహీ! మీ అనుకూలదాంపత్యం నన్ను ఆశ్చర్యతన్మయుణ్ణి చేసింది.
**వైదేహి:** అందరూ మన్నించే మహానుభావుణ్ణి కొంచం వయసు తేడావున్నా చేసుకోటం మంచిదిగాని...

**చంద్ర:** వయస్సులోవున్నా నావంటి నీచుణ్ణి చేసుకోకూడదు. తా వలచినది రంభ - తా మునిగినది గంగ. ప్రేమ ఉన్న చోట దోషాలు, ద్వేషం ఉన్నచోట గుణాలు కనిపించవు.

**వైదేహి:** చంద్రశేఖరం! ఏమిటి నీ మాటలు? ధర్మకర్తగారు నీ శ్రేయస్సుకోరి ఆరమరలు లేకుండా ఆతిథ్యమిచ్చారు. గుర్రాన్నికూడా ఇస్తానన్నారు. ఈ ఆదరాభి మానాలకు నీవు చూపించే గౌరవం ఇదేనా! వారి అంతరం ఎంత! నీ అంతరం ఎంత! ఆయన విశాలహృదయం అర్ధంచేసు కూకుండా ...త్రాగింది తీయేనా! లేక కల్లా.

**చంద్ర:** వైదేహీ! తొందర పడుతున్నావు. కల్లు త్రాగ కుండానే మనస్సులో ఉన్నది దాచుకోకుండా చెప్పటానికి అలవాటు పడినవాణ్ణి. ధర్మకర్తగారికి టీ బదులు ఒక కప్పు కల్లు త్రాగించిచూడు! భాగవతంలోని పద్యాలు చదువుతాడో, పరస్త్రీలమీద సొంతపద్యాలు చెపుతాడో.

**వైదేహి:** అయితే నీవు ఏదీ త్రాగకుండానే.

**చంద్ర:** కాదు వైదేహీ! నేనింతవరకు ప్రపంచంలోచూచిన దంపతులందరూ ఈ భార్య నా కెందుకు దాపురించిందా అని, విశాలప్రపంచంలో ఇంతమంది మంచి మగవాళ్లుండగా

ఈ భర్త యెందుకు దాపురించాడా అని లోలోపల ఏడుస్తూ వున్నవాళ్లే. నీవంటి అనుకూలవతియైన ఇల్లాలి చేతి టీ గాదు - మంచినీళ్లు త్రాగినా జన్మ తరిస్తుంద నిపించింది. నమ్ము వైదేహీ!

*అడుగుల చప్పుడు: భటుల కలకలం.*

*ఇధర్ ఏక్, దో...ఇధర్ ఏక్, దో, తీన్...*

**వైదేహి:** అమ్మో, కొంపమునిగింది. భ...టు...లు...

*ప్రవేశం: సార్జెంట్*

**చంద్ర:** ఎవరు మీరు?

**సార్జెంట్:** (వీరప్రణామంచేసి) ధర్మకర్తగారూ! కుంఫినీ దొరతనంవారి ఆజ్ఞచే మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను.

**చంద్ర:** సరే.

**సార్జెంటు:** క్షమించాలి ధర్మకర్తగారూ! ఇది నా విధ్యుక్త ధర్మం. ఏ మనుకోకండి.

**వైదేహి:** ఇ...దే...మి...టి?

**సార్జెంటు:** ఇదివర కెప్పుడూ మిమ్మల్ని చూచే భాగ్యం కలుగలేదు. ధర్మకర్తగారంటే ఈ సీమలో ఉన్న గౌరవం నాకు తెలియనిదిగాదు. మీ కీర్తి, మీ పాండిత్యం, మీ ఔదార్యం, మీ ఠీవి గూర్చి కథలు కథలుగా చెప్పుకుంటారు. మీరు మేం ధైర్యం చెప్పగలవాళ్ళమా ? ఏదో గుండె రాయిచేసుకొని బయలుదేరమని ప్రార్థిస్తున్నాను.

**చంద్ర:** ఇదుగో...బయలుదేరుతున్నా.

**సార్జెంటు:** ఇది రాజాజ్ఞ. దానకర్ణుడని పేరుపొందిన మహా పండితులవారిని అరెస్టు చేయవలసివచ్చింది. మా దొర కూడ మిమ్మల్ని సగౌరవంగా తీసుకురమ్మని గుఱ్ఱపుబగ్గి ఇచ్చి పంపించారు.

**చంద్ర:** సార్జెంట్! మీ రంత బాధపడనక్కరలేదు. ఇది మీ ఉద్యోగధర్మం. మీరు కాకపోతే ఇంకొరు నెర వేర్చవలసిందే.

**సార్జెంటు:** సర్వజ్ఞులు! సర్వజ్ఞులు. నా పని తేలిక అయిపో యింది. ధర్మకర్తగారూ, ఇక్కడ నే ఆలస్యంచేస్తే దొరకు కోపం వస్తుంది.

**చంద్ర:** నీకు మాటరానిస్తానా! వచ్చేస్తున్నా. ఒక్క నిముషం - దుస్తులు వేసుకోటమే ఆలస్యం...

*జరీతలపాగ, పొడుగుకోటు వగైరా ధరిస్తాడు*

*నిలువుటద్ధంముందు నీటుగా నిలబడి చూచుకుంటాడు*

సార్జెంటు! నా వంటివారి నెవరినైనా ఇదివరకు అరెస్టు చేశావా?

**సార్జెంటు:** అంతదురదృష్టం పట్టలేదు ఈ అరాజక పరిస్థితుల్లో తప్ప.

**చంద్ర:** మీరేం చేస్తారు - ప్రభుత్వమువారి ఆజ్ఞ. ఇదుగో ఇంక బయలుదేరదామా?

**సార్జెంటు:** నాకూ హృదయం ఉంది...మీ శ్రీమతితో ఆఖరిమాటలు మాట్లాడి రండి, ఇవే మీ తుది చూపులుగద.

**చంద్ర:** అవును. ఇంక కలుసుకోం కద.

**సార్జెంట్:** రేపు ఉదయం కోర్టుమార్షల్ చేసి మధ్యాహ్నం ఉరికంబం ఎక్కిస్తారు. కోర్టుమార్షల్ అంటే తమకు తెలియదా?

**చంద్ర:** తెలియకేం, ముద్దాయిని విచారించటానికి పూర్వమే ఉరిశిక్ష వేయటానికి నిర్ణయించుకున్న న్యాయస్థానానికి ఆంగ్లభాషలో కోర్టుమార్షల్ అంటారు అనుకుంటాను. ఏం వైదేహీ! సెలవా మరి ?

**సార్జెంటు:** మీకూ, మీ శ్రీమతికీ మధ్య నిలవను. రెండు నిముషాలు బయట నిలుస్తాను.

**చంద్ర:** వైదేహీ! ఈ మహాయోధుడు మనకు కొన్ని చివరి ఘడియలు ప్రసాదించాడు. (మెల్లగా) యధార్థాన్ని కూడ నీ చేతుల్లో పెట్టుతున్నా. వింటున్నావా వైదేహీ! (ఆమె తల ఉపుతుంది) దగ్గరకురా! లేకపోతే సార్జెంటు అనుమానించవచ్చు. ఇంతవరకూ మనతో ఉన్న మిత్రుడు - రాగానే - ఆయనతో జరిగిన విషయం చెప్తా. అర్థమైందా?

**వైదేహి:** అమ్మబాబో! ఇదేమిటి! ఆపద్బంధవా! జగద్ రక్షకా! (ఏడుస్తుంది)

**చంద్ర:** వైదేహీ! ఏడ్చి లాభంలేదు. విను, అతన్ని దూరంగా పారిపొమ్మను. ఒకవేళ అతడు సాహసించినా మా యిద్దరికీ ప్రమాదం. మోసగాడని నన్నూ, ఆయన్నికూడా ఉరితీస్తారు. ఒక్కమాట, నా సంగతి నీకు తెలుసునుగద! నేను చిన్నప్పటినుండి మొండిపిండాన్ని. ఇప్పుడికి నా అంతట నేను ఉరికంబం ఎక్కటానికి పోతున్నాను. అతనితో చెప్పు, గుర్రం ఉందికద-తప్పించుకొని పొమ్మను. ఉరికంబంనుండి ఒక్క అడుగైనా వెనుకంజ వేయను. మీరు అనుకూల దంపతులు. సుఖంగా ఉండండి. సెలవా మరి. ఆలస్యం చేయగూడదు. నా జీవితం ధన్యమైంది. ఏడు; గట్టిగా ఏడు. అడుగుల చప్పుడు - కౌగిలించుకొని ఏడు.

**సార్జెంటు:** ధర్మకర్తగారూ!

**చంద్ర:** వస్తున్నా. (వైదేహి తల నిమురతాడు, ఆమె ఏడుస్తుంది)

**వైదేహి:** అయ్యో! పాపిష్టిదైవమా! నా కట్లాంటిస్థితి తెచ్చిపెట్టావు! ఆపద్బాంధవా!

**చంద్ర:** సార్జెంట్! ఇవిగో నా చేతులు.

**సార్జెంటు:** ధర్మకర్తగారూ! మీ దెంతటి గట్టిగుండె అండీ! మీరు ఏ మహాసేనాధిపతో కావలసింది. మృత్యు ముఖంలోగూడ

మీరు చూపిస్తున్న ధైర్యసాహసాలు వీరాధివీరులని పేరు కక్కిన వాళ్లలోగూడ చూడం. మీకు సంకెళ్లు వేయకుండా సగౌరవంగా తీసుకొనివెడతాం. దయచేయండి. ఇంటిముందు చాలమంది భటులు మీకు వీరాలాంఛనాలతో స్వాగతం చెప్తున్నారు.

**చంద్ర:** సెలవు వైదేహీ.

*చంద్రశేఖరం సార్జెంటుతో నిష్క్రమణ*

**వైదేహి:** ...ఉ...రి...కం...బం...

*మూర్ఛపడిపోతుంది*

*left..right..left..right...బూట్లచప్పుడు*

*వైదేహి పడిపోయినప్పుడు - నల్లచేవబల్లమీది విగ్రహాలు, కప్పులు, పూలతొట్లు, క్రిందపడిపోతాయి. లాంతరు ఆరిపోతుంది.*

*ప్రమిద మినుకు మినుకు మంటూ వుంటుంది.*

*ప్రవేశం - ధర్మకర్త*

**పట్టాభి:** వైదేహీ! వైదేహీ!...ఆ...ర...ే! వైదేహీ! (లాంతరు వెలిగిస్తాడు...ప్రమిద సాయంతో) వైదేహీ! (ఆమెతల తన తొడమీద పెట్టుకొని) వైదేహీ! ఏమిటిది! లే.

**వైదేహి:** ఆ! మీరా! వచ్చారా!

**పట్టాభి:** నేనే...వచ్చాను లే వైదేహీ!

**వైదేహి:** ఏం జరిగిందీ...అమ్మో.

**పట్టాభి:** ఏం జరిగింది? నీవే చెప్పాలి. కుర్చీ తలక్రిందుగా పడింది...త్వరగా లే.

**వైదేహి:** (లేచి నిలిచి) ఏం జరిగింది!...నేను మేలు కొన్నానా? నిద్రపోతున్నానా! ఇది కలా...నిజమా!

**పట్టాభి:** నా తెలివి తగలడా! నాదే తప్పు...ఆ చంద్ర శేఖరాన్ని అట్లా ఇంట్లో వదిలి వెళ్లిపోవటం నాదే తప్పు.

**వైదేహి:** అట్లా అనకండి. ఆపద్బాంధవా! జగద్రక్షకా! నాకు భయంగా ఉంది...

**పట్టాభి:** ఎందుకు అట్లా గజగజ వణికిపోతున్నావు! ఏం జరిగినా పరవాలేదు. నీ సంగతి నాకు తెలియదా! ఆ చంద్రశేఖరం సంగతి నాకేగాదు - ఉరందరికీ తెలియదూ !

**వైదేహి:** మీ కేమి తెలియదు, ఉళ్లో ఎవరికీ తెలియదు. మన గుర్రం...పాపం...అతడు...ప్రమాదం... ఘోర ప్రమాదం.

**పట్టాభి:** ఇదేమిటి?...నీ వింతధోరణి...అతడు...ఏమైంది?

*ప్రవేశం: రంగస్వామి*

**రంగ:** వైదేహమ్మగారూ! వైదేహమ్మగారూ! ఆరరే! ధర్మకర్తగారిక్కడే ఉన్నారే! ఒకభటుడువచ్చి వైదేహమ్మ గారు మూర్చ పడిపోయారు...వెళ్లి చూచిరమ్మన్నాడే!

**పట్టాభి:** అదా! భటులు వచ్చారన్నమాట. ఇప్పటికి అర్థ మైంది. ఏం వైదేహీ! పాపం చంద్రశేఖరాన్ని భటులు వచ్చి పట్టుకొనిపోయారా? నే చెప్పలేదా...నా మాట విన్నావా? నే చెప్పినప్పడే గుర్రం ఎక్కితే ఈ పాటికి ఎక్కడుండేవాడు.

**రంగ:** ఆ భటుడు మా తమ్ముణ్ణి పట్టుకున్నట్లు చెప్పలేదే!

**వైదేహి:** నీ వింటికి పో రంగస్వామీ!

**పట్టాభి:** చెప్పెయ్ వైదేహీ! సత్యం స్వయం ప్రకాశమానం. నిజం దాగదు. ఎంత చీకటి అయినా ఉళ్లో తెలియకపోదు.

**రంగ:** కొంపదీసి మా తమ్ముణ్ణి పట్టుకుపోయారా! బాబో నాకు భయంగా ఉంది. నన్నేం చేస్తారో!

**పట్టాభి:** భయపడకు రంగస్వామీ! కష్టకాలంలోనే గుండె ధైర్యం ఉండాలి. మనం ఆలోచించి అతనికి ఎదైనా సాయం...

**రంగ:** బాబో - నేను రాను. మా అమ్మ నిన్న వాణ్ణి అట్లాగే శపించింది.

*రంగస్వామి నిష్క్రమణం*

**పట్టాభి:** రంగస్వామి ఉట్టి పిరికిపంద. ఈ విపరీతపరిస్థితులు లేకపోతే - నామాట తెల్లదొరలుముటుకు త్రోసేస్తారా? అయినా ప్రయత్నిస్తాను వైదేహీ! నీ హృదయం సుకుమారమైంది. అతనికి ఆపదవచ్చినా నీ హృదయం కరగి పోయింది. ఏదీ నా చేతికర్ర ఇట్లా అయ్యే.

**వైదేహి:** ఆగండి. మీరు వెళ్లగూడదు. గత్యంతరం లేదు.

**పట్టాభి:** సాటివాడు ఆపదలో చిక్కుకుంటే - పిరికిపందలాగ ఇంట్లో కూర్చోమంటావా? ఇంతేనా నన్నుగూర్చి నీవు తెలుసుకో గలిగింది. ఇన్నాళ్లు అందరికీ బోధించిన వేదాంతం ఏమౌతుంది?

**వైదేహి:** ఆగండి, నేను మీ భార్యను. అందరి భార్యల వలెనే భర్త బ్రతకాలని ఇంత క్షోభ పడుతున్నా. మీరు ప్రమాదంలో చిక్కుకోటం నా కిష్టం లేదు.

**పట్టాభి:** ఏదీ - నా కోటు, నా జరీతలపాగ. ఆ! కొంప దీసి నా కోటు, నా తలపాగ పెట్టుకొని పోయాడా?

**వైదేహి:** అవును.

**పట్టాభి:** నిజమే. అతనికోటు తొడుక్కోటానికి బదులు నా కోటు తొడుక్కున్నాడు. ఉరికంబం ఎదురుగా కనిపించేటప్పుడు ఎవరికైనా మతిపోవచ్చు. నీ వైనా చెప్పలేదా?

**వైదేహి:** చెప్పవలసిందేగాని నాకు నోరురాలేదు.

**పట్టాభి:** అంతే.

**వైదేహి:** భటులు వచ్చింది మిమ్మల్ని అరెస్టుచెయ్యటానికి.

**పట్టాభి:** ఆఁ! అయితే చంద్రశేఖరాన్ని ఎట్లా పట్టుకొని వెళ్లారు?

**వైదేహి:** వాళ్లకేం తెలుసు! చంద్రశేఖరం తానే ధర్మకర్తనని చెప్పి, మీ దుస్తులు తొడుక్కొని చేతికర్రకూడా వదలకుండా ఠీవిగా వెళ్లాడు.

**పట్టాభి:** ఆఁ! ఆశ్చర్యంగా ఉందే! తెల్లదొరలు నన్నే ఉరి దీయాలని నిశ్చయించుకున్నారన్నమాట. అవును - ఎల్లాగయినా ఉళ్లోకల్లా చెప్పుకోదగ్గవాణ్ణి నేనేగదా! చంద్ర శేఖరం వెళ్లేముందు నీతో ఏం చెప్పలేదూ ?

**వైదేహి:** చెప్పకేం, ధైర్యంగా ఉండమన్నాడు. మిమ్మల్ని వెంటనే గుర్రమెక్కి తప్పించుకొని పొమ్మన్నాడు.

**పట్టాభి:** అప్పుడైనా నా అతన్ని మర్యాదగా చూశావా?

**వైదేహి:** నా గుండె బద్దలై పోయింది. అతని భార్యగా నటించి విడువవలసివచ్చింది. మూర్చపడిపోయాను. తరువాత తెలివి వచ్చేసరికి మీ ఒళ్లో ఉన్నాను. ఇదంతా ఒక కలలా జరిగిపోయింది. మీకోసం అంటే నా భర్త కోసం తన ప్రాణాన్ని బలియివ్వటానికి సంతోషంగా సంసిద్ధమైన చంద్రశేఖరాన్ని కౌగిలించుకొని ఏడ్చాను.

**పట్టాభి:** పోనీలే - నువ్వు బాగా నటించావుగద! భటులు, సార్జెంటు అనుమానించలేదుగద! కొంపదీసి ఉరికంబాన్ని చూచేసరికి నిజం చెప్పేస్తాడేమో!

**వైదేహి:** చెప్పడు. చచ్చినా చెప్పడు.

**పట్టాభి:** వెర్రిదానా! చావంటే భయపడనివాడు సాక్షాత్తు ఆ మృత్యుంజయుడే. అతడు నిజం చెప్తాడేమో! నే నిక్కడ ఒక్క

క్షణంగూడ నిలువగూడదు. అడ్డులే, పోవాలి. నువ్వు పుట్టింటికి వెళ్లిపో.

**వైదేహి:** మరి - చంద్రశేఖరం సంగతి? ఉరికంబం ఎక్కవలసిందేనా!

**పట్టాభి:** చేతులారా చేసుకున్నదానికి నే నేమి చేయగలను? ఒకవేళ నేనిప్పు డక్కడకు వెళ్లి నిజం చెప్పినా లాభంలేదు. అసలు ధర్మకర్తనని నన్నూ, మోసం చేశాడని అతన్నీ ఇద్దరినీ కలిపి ఉరిదీస్తారు.

**వైదేహి:** చంద్రశేఖరంగూడ అదేమాట అన్నాడు. అయినా - మిమ్మల్ని ఉరిదీస్తే ప్రజలు ఉరుకుంటారా? ప్రజలకు మీరంటే అపారవిశ్వాసం.

**పట్టాభి:** అసమయసాహసం పిరికితనంకంటే గర్హింప దగింది. ప్రజలు గొర్రెలమంద. ప్రజలమీద నా కేమీ విశ్వాసం లేదు.

**వైదేహి:** దేవాలయంలో మీరే స్వయంగా సహస్ర నామార్చన చేయండి. ఆ గజేంద్రుణ్ణి రక్షించిన శ్రీమన్నారాయణుడు మీ మొఱ ఆలకించి ప్రత్యక్షం కావచ్చు.

**పట్టాభి:** సహస్ర నామార్చన - ప్రస్తుతం రాతిదేవుడు చేయ గలిగింది ఏమీ లేదు.

**వైదేహి:** అయితే – చంద్రశేఖరం గతి! ఉరికంబం ఎక్క వలసిందే!

**పట్టాభి:** ఆగు. ఈ రాత్రి వాయువేగంతో గుర్రమెక్కి భువనగిరికోట చేరుకుంటాను. తెల్లవారకుండా సిపాయీ లను ఈకోట పట్టుకునేటట్లు పురికొల్పి వీలైతే రేపు చంద్ర శేఖరాన్ని విడిపిస్తాను. తనకుతాను సహాయం చేసుకునే వాళ్లకే దేవుడుసహాయం చేస్తాడు.

**వైదేహి:** అయితే మీ రిప్పుడు వెళ్లేది!

**పట్టాభి:** ఆడదానికి ఆ సంగతి నీ కెందుకు! నే నెక్కడకు వెళ్లేదీ నా కే తెలియదు. చంద్రశేఖరంకోటు నేను తొడుక్కుంటాను; సులభంగా తప్పించుకొని పోవచ్చు.

*ఆ కోటు తొడుక్కొని నిలువుటద్ధంముందు నిలుచొని*

వైదేహి! అతనిలాగే ఉన్నానా!

**వైదేహి:** అతనిలాగా! ఆతనికి అతడే సాటి.

*పట్టాభి నిష్క్రమణం*

అయ్యో! చంద్రశేఖరం!
ఉ...రి...కం...బం...

*వైదేహి మూర్ఛపడిపోతుంది - తెరతోపాటు*

**తెర**